# గీత చెరిగిన క్షణం

ధనవంతులందరూ పేదవాళ్లని హేయంగా చూస్తారనీ, పేదవాళ్లందరూ ధనికుల్ని తిట్టుకుంటూ ఉంటారనే మనకో మిథ్యా భావన వున్నదన్నది మిథ్యకాదు.

ధనికులూ పేదలూ స్నేహంగా వుంటారా? అసలుండగలరా?

స్నేహంగా అంటే?!

సినిమాల్లో చూపించినట్టు భుజాలమీద చేతులేసేసుకుని చెట్టాపట్టాలుగా తిరగడమా? ప్రేమించేసేసుకొని పెళ్లాడేసుకోడమా? స్నేహం కోసం ప్రాణాలు ఇచ్చేసుకోడమా?

అసలు ధనిక పేద వర్గ నిర్ణయం ఎవరు చేస్తారు? గిరి ఎవరు గీస్తారు?

ఆ గీతలు చెరిగిపోతాయా? చెరిగితే ఎవరు చెరపాలి?

అవి చెరగవు గాక చెరగవు. అది కఠోర వాస్తవం. మనం అంగీకరించి తీరాలి.

అయితే కొన్ని అద్భుత సంఘటనలు ఆ గీతల్ని తాత్కాలికంగా మాయం చేస్తాయి.

ఆ క్షణాల్లో అక్కడ స్నేహం, ఆత్మీయతా వికసించి గుబాళిస్తాయి. అటువంటి పరిమళభరిత సంఘటన...

ఓ రెండు మూడేళ్ల క్రితం నేనూ శంకర్ పాత టౌన్‌లో బాలసరస్వతి బుక్‌డిపో సందులోంచీ ఏదో పనిమీద వెళ్తున్నాం. టర్నింగ్‌లో స్కూటరు స్లో చేసి వెళ్తోంటే...

"సామీ శంకరయ్యా! శంకరయ్యా సామీ!" అన్న పిలుపుతో శంకర్ స్కూటరాపాడు.

ఓ స్త్రీ మూర్తి...

పోల్చుకో ప్రయత్నించి కొన్ని క్షణాల తర్వాత పోల్చుకుని...

"చిన్నక్కా నువ్వా!" అన్నాడు ఆప్యాయంగా.

'చిన్నక్కా' అని శంకర్ పిలిచిన ఆ చిన్నక్క వయసు పెద్దదే డెబ్భై అయిదు సంవత్సరాలుంటాయామెకు.

'రా సామీ ఇంట్లోకి" ఆదరంగా ఆహ్వానించిందామె.

ముతక నేత చీర... ఆభరణ రహిత గాత్రం... ఇంటిలోపలి వాతావరణం... ఆమె ఆర్థిక స్థితిని లౌడ్ స్పీకర్లో అరుస్తున్నాయి. దారిద్ర్యం అన్న మెట్టు దాటి పైమెట్టుకు వచ్చినట్టు తెలుస్తోంది.

మా శంకర్ ఆర్థికంగా సంఘంలో క్రీమీలేయర్‌కు చెందినవాడు. ఏసీకారూ ఏసీ ఇల్లూ ఏసీ ఆఫీసూ వున్న ట్యాక్స్ కన్సల్టెంట్ (మనసు కూడా ఏసీనే మా శంకర్‌ది)

ఆమె కుశలం ఆరా తీస్తున్నాడు శంకర్. మాటల్లో నేను గ్రహించిన విషయాలు...

ఆమె ఒకప్పుడు శంకరింట్లో పనిమనిషి. శంకర్‌కు ఎనిమిదేళ్ల వయస్సప్పుడు వాళ్లింట్లో పనికి కుదిరింది. శంకర్‌కు దాదాపు దాయి అయ్యింది. వారం వారం నూనె, నలుగుతో తలంట్లూ... శంకర్ ఆమెను ఇల్లంతా పరిగెత్తించడం.. ఆమెను నానా తిట్లూ తిట్టడం... ఆమె పట్టువదలక శంకర్‌కు తలంటడం లాంటి విషయాలు దొర్లుతున్నాయి. వాళ్ల సంభాషణలో జొన్నరొట్టెల విషయం వచ్చింది.

అప్పట్లో బ్రాహ్మల కొంపల్లో జొన్న రొట్టెలు చేసేవారు కాదు. శంకర్కి జొన్నరొట్టె ప్రాణం. చిన్నక్క కొంగుచాటు దాచుకొచ్చి తెచ్చి పెట్టిన జొన్నరొట్టెలూ కారం గురించి చెప్పి నవ్వుతున్నాడు శంకర్.

జొన్నరొట్టె ప్రస్తావన రాగానే చిన్నక్క...

"శంకరయ్య సామీ రొట్టె ఉండాది తెత్తునా పుందు కూర పొప్పుజేసినా" అంది. (మా రాయలసీమలో గోంగూరను పుందు కూరంటారు)

"పళ్లు లేవు కదా చిన్నక్కా" నవ్వుతూ అన్నాడు శంకర్.

"మెత్తగా సితక్కొటిస్తా పొప్పులోకి తినుసామీ" అని చిన్నక్క జొన్నరొట్టె గోంగూర పప్పు తెచ్చిపెట్టింది. శంకర్ తృప్తిగా తిన్నాడు.

* * *

***ఇలాంటి సంఘటనల్లో ధనిక పేద వ్యత్యాసాన్ని తెలిపే గీత చెరిగిపోడం అబ్బురంగా చూస్తాం మనం.***

***మనకు తెలుసు అది తాత్కాలికంగా మాయం కావడమే కానీ చెరిగిపోవడం కాదని.***

***అక్కడ ఆ క్షణాన ఆ వ్యత్యాసం మాయమైనచోట స్నేహం ఆత్మీయతా విడిగి విప్పారి పరిమళాలు వెదజల్లడం చూస్తాం.***

***అది తాత్కాలికం కాకుండా శాశ్వతమయితే! ఆ క్షణం కోసం ఎదురుచూద్దాం.*** ●